# ఎరుకుల జన జీవనానికి అద్దం పట్టే "ఎల్లి"



డా|| మెండా దేవానంద్ కుమార్

తెలుగు విభాగాధిపతి.

డా.లక్కిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ

డిగ్రీ కళశాల మైలవరం

---

**ఉపోద్ఘాతం :**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గిరిజనుల ఉనికి నేటికీ సజీవంగా ఉంది. ఆదివాసిలుగా పిలువబడే చెంచులు, ఎరుకల, యానాది ఉప కులాల్లో చెప్పుకోదగ్గవారు. వీరి జీవనం అన్నీ వర్ణలవారికి, గుడికి, బడికి దూరంగా మురికి కాలువల వెంట చిన్న చిన్న చుట్టు గుడిసెల్లో కొనసాగుతుంది. వీరి ప్రధాన వృత్తి పందుల పెంపకం, ఎలుకలు పట్టడం, చేపల వేట. ఇంటిల్లిపాదికి కల్లు ప్రీతికరమైన పానీయం. తెలుగు సాహిత్యంలో వీళ్ల ప్రస్తవన అక్కడక్కడ కనిపిస్తూంది. నిరాక్షరాస్య స్థితి నుండి ఇప్పుడిప్పుడే అక్షరాస్య స్థితిని అందుకొనడం అభినందనీయం. తమ తమ జీవితాలను వివిధ రచన ప్రక్రియల్లో అక్షరబద్ధం చేయడం ద్వారా వీరి స్థితిగతులు ప్రపంచానికి పరిచయమైనాయి.

"ఎల్లి" ఎరుకుల జన జీవనానికి అద్దం పట్టే నవల. అరుణ దీన్ని ఎంతో ఆర్తితో అక్షరబద్ధం చేసారు. నవల మొత్తం ఎల్లి, బాజీ చుట్టూ తిరుగుతుంది. కథనాయకుడు జీవా. చుక్క పొడిచింది, తెల్లారలా అనే మాటలతో నవల ప్రారంభమవుతుంది. వన్నెటొడ్డున నాలుగైదు గుడిసెల్లో ఎల్లి కుటుంబం జీవిస్తూంది. ఎల్లి తాత సుబ్బన్న పెళ్ళై ఇద్దరు పిల్లలున్న మాలచ్చిమి భర్తకు ఓలి ఇచ్చి మారు మనువు చేసుకున్నాడు. ఎరుకుల కులాచారం ప్రాకారం పెళ్ళాన్ని ఎప్పుడైన, ఎంతకైనా అమ్ముకునే హక్కు మగాడికి ఇచ్చింది.

సుబ్బన్న దగ్గరకు వచ్చాకా మాలచ్చిమి ఇద్దరు పిల్లలు పుట్టారు. మొదట కుతూరు బాజీ, తరవాత కొడుకు ఎంకన్న. బాజీ అమ్మ నాన్నకు చెదోడు వాదోడుగా ఉండేది. పందులకు కుడితి పెట్టడం, చింత చెట్టు ఎక్కి చిగురు దూయడం, చిగురు ఊళ్ళో అమ్మి ఎచ్చాలు కొనుక్కురావడం చేసేది. బాజీ అందకత్తె. దానికి తోడు వయస్సు రావడంతో నూతన అందాలతో కనువిందుగా ఉండేది. నిద్రగన్నేరు చెట్టు కింద యాతమండలని చెలుగుతున్న సుబ్బన్నను "ఏమయ్యా అట్టా పట్టపట్టు తిరగటమేనా, యాడొచ్చిన పిల్లని యింటో పెట్టుకుని నిదరెట్టాబడుతుంది నీకు" అంది మాలచ్చిమి.'చూద్దాంలే' అన్నాడు సుబ్బన్న మండలు చెరగడం ఆపకుండానే. 'యిదుగో చెపుతున్నా, యింకా సాజేత జెయ్యొద్దు' అంది మాలచ్చిమి.

తెల్లారి వస్తూ, వస్తూ పెళ్ళి పెద్దలను వెంట బెట్టుకొచ్చాడు సుబ్బన్న. వాళ్ళు రావడం బాజీని చూసుకోవడం, లగ్గాలు పెట్టుకోలడం అంతా చిటుక్కున అయిపోయింది. మాలచ్చమి తెగ సంబరపడింది. ఓ రోజు చిగురు కెళ్ళిన బాజీ చిగురు లేకుండా గుడిసెకొచ్చి చాపేసుసుకుని బొక్కబోర్లా పడుకుంది. బయట చాప అల్లుతున్న మాలచ్చామి ఏమిటబ్బా పిల్ల అట్లా వుంది అనుకుని గుడిసెలోకెళ్ళి బాజీని వంటోబాగోలేదా? అంటూ కుదిపింది. అప్పటి వరకు వుగ్గబట్టుకున్న ఏడువు వొక్కసారిగా పొంగింది. ఆ వూళ్ళో పోకిరి కుర్రాళ్ళు తన పై చేసిన ఘోరాన్ని తల్లికి చెప్పింది.

ఊరుకోమ్మా ఏం జేస్తాం, మన కర్మ ఎక్కడా యీ సంగతి ఎవరికి తెలియనియ్యాబాకు ! అంది ఏడుపు దిగమింగుతో మాలచ్చిమి. తల్లి ఓదార్పుతో బాజి మాములు మనిషి అయినట్టు కనిపించింది. అనుకున్న లగ్గానికి మనువు జరిగింది. కాపురానికి వెళ్ళిన పది రోజుల్లోనే బాజీని తీసుకుని వచ్చిన అల్లుడిని చూసి మాలచ్చిమి కంగారు పడింది. వెళ్ళేముందు అల్లుడు తనను దగ్గరకు రానివ్వడం లేదని,అసలు ఉలుకు పలుకు లేకుండా వుంటుందని చెప్పి వెళ్ళిపోయాడు. అలా చెప్పెళ్ళిన మనిషి మరల తిరిగి రాలేదు. బాజీ పిచ్చి పట్టి కాలువలో పడి చనిపోయింది. కూతురు మీద బెంగతో సుబ్బన్న చనిపోయాడు.

ఎల్లికి గుండారు గూడెం సంబంధం అనగానే మాలచ్చిమికి భయం, దానితో పాటు బాజీ జీవితం కళ్ల ముందు మెదిలింది. ఎంకన్న ఇవేమి పట్టనట్టు లగ్గాలు పెట్టుకొని ఓలి ముందే పుచ్చుకున్నాడు. పెళ్ళికొడుకు ముదర , అన్ని అలవాట్లు ఉన్నాయన్నా వినిపింకోలేదు. మనువు జరిపించాడు. మూడు రాత్రులు నిదరలయ్యాక ఎల్లి యింకా చిన్నది కాబట్టి, పెద్దదయ్యేదాక ఎంకన్న యింట్లోనే వుంది.

దురగ నిండు గర్భిణి . బిడ్డ అడ్డం తిరగడంతో మంత్రసాని ఎన్ని ప్రయత్నం చేసినా చావుని ఆపలేక పోయింది. మాలచ్చిమి లబలబ నెత్తి నోరు కొట్టుకుని ఏడ్చింది. ఎంకన్న పిచ్చి పట్టిన వాడిలా అయ్యాడు. ఎల్లి తల్లి మీద పడి ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లి పడింది. కుటుంబ భారం మొత్తం ఎల్లి మీద పడింది. రెండు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. పెద్దమనిషి అయిన ఎల్లి సంసారానికి వెళ్ళింది. ఎల్లి మోగుడికి అనుమానం, తాగొచ్చి గొడ్డులా మీద పడి నానా హింసలు పెట్టేవాడు. అత్త మామలు కొట్టేవాళ్ళు.

బాధలు భరించలేక పుట్టింటికొచ్చి మాలచ్చిమి మీద పడి గావురున ఏడ్చి ఇక్కడే వుంటాను అక్కడికి వెళ్ళనని చెప్పింది. మాలచ్చిమికి తన కూతురు బాజీ మాటలు గుర్తుకొచ్చాయి. ఎల్లి తల నిమురుతూ వెళ్ళొద్దులే ఇక్కడే ఉండు మేనత్త కష్టాలే నీకు వచ్చాయి అంటూ మాలచ్చిమి కనీళ్లు పెట్టుకుంది. ఎంకన్న ఓలి ఇచ్చి మారు మనువు చేసుకోడానికి సంబంధాలు చూసుకుంటున్నాడని పారొతి చెప్పడంతో మాలచ్చిమికి ఎక్కడ లేని కోపం వచ్చి ఎంకన్నను తిట్టింది.ఎల్లికి ఇచ్చిన ఓలి తిరిగి ఇచ్చి పెద్దల పంచాయితీలో తెగతెంపుచేసుకున్నాడు ఎంకన్న. మాలచ్చిమి మరిది కొడుకు బిచ్చలు బాగా తాగి తన పెళ్ళం పారొతిని ఓలి తీసుకుని అమ్మేసాడు. ఎల్లి పరుగు పరుగున ఎంకన్నను తీసుకొచ్చింది. రావడమే బిచ్చలు గూబ పగలకొట్టి వాళ్ళని తరిమేసాడు. జీవాలు ఓలి ఇచ్చి ఎల్లిని మనువాడతాడని పారొతి మాలచ్చిమిని అడిగింది. ఎల్లి జీవితంలో కొత్త ఆశలు చిగురించాయి.